# విడాకులు

డా॥ జె. మంగమ్మ



సిల్వియా వేళ్ళు యాంత్రికంగా కదులు తున్నాయి. డ్రాయింగ్ రూములో బేవిండోలో కూర్చొని సిల్వియా ఏదో అల్లుతోంది. షెడ్ లోకి కారు వచ్చినట్లు కళ్ళయితే చూశాయి గానీ శరీరం చలించలేదు. వరండాలో అడుగుల చప్పుడు. అది పరిచితమయిన చప్పుడు. తనను మైమరపించే చప్పుడు. మరి ఈ వేళేమయింది? నిట్టింగ్ నీడిల్ ఆడుతూనే ఉంది. రాబర్ట్ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. నిట్టింగ్ నీడిల్‌నే చూస్తున్నాడు.

“సిల్వియా!” అని నెమ్మదిగా పిలిచాడు పాపం.

సిల్వియాకు ఏదో ఉరుములా ఉంది ఆ శబ్దం.

“రామూ! బాబుగారి టీ” అంది వంటింటి వైపు చూస్తూ. తనకు టీ కావాలనే రాబర్ట్ అడిగినట్టుంది మరి.

“సిల్వియా! విన్నే! నాతో మాటలు మానేశావా? రోజంతా ఆ మాటే ఆలోచించాను.”

“ఏం నిర్ణయించారు?”

“నిజంగా మనం ఇక కలిసి ఉండలేమా?”

“ఉండలేమని అనుకున్నాం కదా?”

ఇరవై వత్సరాలు కలిసి ఉన్నారు. ఇల్లు కట్టుకున్నారు. రాబర్ట్‌కు మంచి ఫర్మ్‌లోని పని. ముచ్చటగా ముగ్గురు పిల్లలున్నారు. మరి ఇప్పు డేమయిందో?

ఇరవై ఏళ్ళ తరవాత ఇప్పుడు పిల్లలను పెంచే పద్ధతుల మీద ఇద్దరికీ ఏకాభిప్రాయం కుదరలేదు. సిల్వియాకు పాశ్చాత్య పద్ధతులే కావాలి. తాను పుట్టి పెరిగింది వాటిలో.

ఉన్న పరిస్థితుల బట్టి పోవాలంటాడు రాబర్ట్.

“చూడు సిల్వియా! మరి పిల్లల మాటేమిటి?” అన్నాడు మెల్లగా రహస్యం చెప్పినట్టు.

“పిల్లలకు చెప్పాలి. అది మీ పనే!”

ఇంతలో రాము బల్ల మీద టీ పెట్టి వెళ్ళాడు. మేడ దిగి వస్తున్నాడు పీటర్. పదవ తరగతి పరీక్షలు వ్రాశాడు. ఇక బడిలేదు. ఏదో ఒకటి చేస్తూ ఉండాలి. కామెక్సు చదవటం ఇష్టం. కనీ ఎంత సేపని చదవగలడు?

మెట్ల దగ్గర నిలబడి టామీ తోకవూపుతూ ఉంది. పీటర్ దాని వీపు నిమురుతూ ఆఖరు మెట్టు మీద కూర్చున్నాడు. యథాలాపంగా పెద్ద కిటికీ వైపు చూశాడు.

అమ్మా, నాన్న ఏదో మాట్లాడుకుంటున్నారు. లేచి ఒక కప్పు టీ తాగి లైట్ ఆన్ చేసి తోటలోకి వెళ్ళాడు. టామీ వెంట పడింది. గేటు తీసి కుక్కను వెంట బెట్టుకుని బయటకు నడిచాడు.

సిల్వియా నిట్టింగ్ పక్కకు పెట్టింది.

ఇద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళారు. రాబర్ట్ టీ కలుపుకొంటున్నాడు. రాత్రికి ఏం చేయాలో రాముకు చెప్పడానికి సిల్వియా వంటింట్లోకి వెళ్ళింది. వంట పనులు, చిల్లర పనులు చేసేందుకు రాము చాలు. ఆ కుటుంబానికి ఒకామె వచ్చి గదులు తుడిచి బట్టలుతికి వెడుతుంది.

భోజనాల దగ్గర ఎవరూ ఎక్కువ మాట్లాడు కోలేదు. పీటరు కిది కొత్తేమీ కాదు.

“డాడీ! మిరియం రేపు ఉదయమా వచ్చేది?”

“త్రవుమ” కోర్సు పిన్న అయి ఉంటుంది. ఈ వేళ ప్లేన్‌లో!!

“ఎన్నింటికి ప్లేన్?”

“ఉదయం నాలుగింటికే—నేను వెడతాను ఏర్ పోర్ట్.”

మామూలుగా అయితే సిల్వియా లేకుండా వెళ్ళడు.

“ఓ. కె.! మమ్మీ, డాడీ గుడ్‌నైట్” అంటూ పాల కప్పు ఖాళీ చేసి గదిలోకి వెళ్ళిపోయాడు పీటర్. ఏర్‌పోర్ట్‌కు నేనూ వస్తానని సిల్వియా అననూ లేదు, రాబర్ట్ అడగనూ లేదు.

బల్ల దగ్గర నుండి భారంగా లేచి సిగరెట్ వెలిగించుకుంటూ వరండాలోకి వెళ్ళాడు. మెల్లగా నడిచాడు గేటు దగ్గరకు. తాళం వేశాడు. వెనక్కు వచ్చి వరండాలో కాసేపు నిలబడ్డాడు. దిమ్మమీద కాసేపు కూర్చున్నాడు. టామీకి స్వయంగా పడక అమర్చాడు ఒక మూల. అప్పుడే హాల్లోంచి మూతి నాక్కుంటూ బయటకు వచ్చిన టామీ

ఒకసారి గేటు దాకా వెళ్ళింది. తోటలో ఈ మూల ఆ మూల చూసింది. అటూ, ఇటూ తిరిగింది. డ్యూటీ ప్రారంభమయిందన్నట్టు దిమ్మ మీదకు గంతేసి వెనక కాళ్ళ మీద కూర్చుంది.

హాల్లో సోఫాలో కూర్చొని రాబర్ట్ కాస్సేపు ఏదో మాగజైన్ తిరిగేశాడు. మామూలుగా అయితే హాల్లో సందడిగా ఉండేది. రాము వంటింట్లో గిన్నెలు శుభ్రపరుస్తున్నాడు. సిల్వియా ఆ సాయంత్రమంతా ఏమీ మాట్లాడలేదు. టూ—ఇన్—వన్ పలకలేదు. టెలివిజన్ తలుపులు తెరవనన్నా లేదు. పనులు పూర్తి చేసిన రాము వంటింటి తలుపు వేసి, అయ్యగారికి సలాం చెప్పి బయటకు వెళ్ళటంతో రాబర్ట్ సోఫాలోంచి లేచాడు. కారు షెడ్ పక్కనే రాముకు ఒక చిన్న గది ఉంది. తలుపులు వేసుకుని లైట్లు ఆర్పేసి పడక గదిలోకి వెళ్ళాడు రాబర్ట్. అప్పటికే సిల్వియా అటు తిరిగి పడుకుని ఉంది. ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. మంచం మీద చెరొక చివరన పడుకున్నారే గానీ మెదిలితే పక్కన ఉన్న మనిషికి నిద్రాభంగమవుతున్నట్టు ఇద్దరూ మగత నిద్రలోనే గడిపారు.

తెల్లవారుజామున డైనింగ్ హాలులో పెద్ద గడియారం మూడు కొట్టింది. రాబర్ట్ లేచాడు. ఏ మాత్రం చప్పుడు లేకుండా చివరకు చెప్పులు కూడా చేతితో పట్టుకుని గదిలోంచి బయటకు వచ్చాడు. ఇవతలి బాత్‌రూంలో ముఖం కడుక్కున్నాడు. హాల్లో చిన్న లైటు వెలుతురులో డ్రెస్ చేసుకున్నాడు. చప్పుడయితే సిల్వియాకు నిద్రా భంగమవుతుందన్నట్టు నెమ్మదిగా తలుపు తీసుకుని బయటకు వచ్చాడు. తాళాలు మెల్లగా ఆడిస్తూ వెళ్ళి షెడ్‌లోంచి కారు బయటకు తీశాడు. టామీ దిమ్మ మీద పడుకుని అన్నీ చూస్తూ ఉంది కిమ్మనకుండా. రామునాగు లేచి గేటు తీయమన్నాడు. కారు బయటికి వెళ్ళగానే గేటు మూసి వేసి మళ్ళీ నిద్రలో పడ్డాడు రాము.

ఏర్‌పోర్ట్‌లో రాత్రింబగళ్ళు సందడి ఉంటుంది. అందులో రాత్రిళ్ళు మరీను. కాస్త అలస్యమయినా విమానం రానే వచ్చింది. విజిటర్స్ గాలరీలోంచి ఆదుర్దాగా చూస్తున్న రాబర్ట్ దూరం నుంచే కూతుర్ని గుర్తు పట్టాడు. చేయి వూపాడు. కస్టమ్స్‌లో ఎక్కువ టైము పట్టలేదు. చదువుకోవడానికి వెళ్ళిన అమ్మాయి ఏం సామాన్లు తెస్తుందని?

"హలో డాడీ!" అని సూట్‌కేస్ తండ్రికి అందించింది.

"ప్రయాణం బాగా జరిగిందా?"

"ఓ! ఫైన్ డాడీ! హౌ ఈజ్ మమ్మీ?

టామీ బాగుందా?" గబగబా అడుగుతోంది.

అన్నిటికీ అవుననీ, కాదనీ ఏదో చెబుతున్నాడు. ఇప్పుడు అమ్మాయి మనసు కష్టపెట్ట కూడదు. చూద్దాంలే, ఆ తరవాత అనుకున్నాడు.

"పీటర్ పరీక్షలు బాగా రాశాడా? జాన్ ఎలా ఉన్నాడు? ఏర్‌పోర్ట్‌కు వస్తానని గొడవ చేశాడా?"

"జాన్ పిక్‌నిక్ వెళ్ళాడు."

"ఓ! ఐ సీ. ఏం పిక్నిక్ డాడీ?"

"ఆ. రెండురోజుల క్యాంప్ బడి పిల్లలంతా."

"హౌ నైస్! పారిస్‌లో ఇంతే డాడీ. పిల్లలు ఎప్పుడూ మమ్మీ, మమ్మీ అనుకొంటూ చుట్టూ తిరగరు ఇండియాలో లాగ!

"నీకు ఎలా ఉంది అమెరికా?"

"అక్కడ చాలా బాగుంటుంది. పిల్లలు ఫ్రీగా పెరుగుతారు. పెద్దయితే ఏం పని చేయాలో ముందే నిర్ణయించుకుంటారు. ఆ పని నేర్చుకుంటారు?"

"నీకు అక్కడే బాగుందా మిరియం?"

"సర్టన్లీ డాడీ! మరి అమ్మకు ఇండియా ఎలా నచ్చిందో!"

రాబర్ట్ ఏమీ అనలేదు. అంతా తల్లిపోలికే అనుకున్నాడు తనలో.

కారు దిగి గేటు తీస్తున్నాడు.

కారు దిగిన మిరియం మీదకు ఒక్క పరుగున వచ్చి పడింది టామీ. కుక్కలకు ఇంట్లో మనుషు లంతా బాగా గుర్తుంటారు. కుక్కను విదిలించుకుంటూ లోపలికి పరుగు తీసింది మిరియం.

"మమ్మీ!"

అప్పటికే వరండాలోకి వచ్చిన సిల్వియా కూతురిని వాటేసుకుని తల నిమిరి ముద్దు పెట్టింది.

కార్లోంచి తీసిన సూట్‌కేసును రాము తీసుకెళ్ళి మిరియం గదిలో పెట్టాడు.

అప్పుడే పక్క దిగి వళ్ళు విరుచుకొంటూ పీటర్ వరండలోకి వచ్చాడు.

"హలో మిరియం డియర్!" అంటున్న తమ్ముణ్ణి—

"హలో" అని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది.

అమ్మాయి క్షేమంగా తిరిగి వచ్చింది. అంతే చాలు ననుకుంది సిల్వియా.

అమ్మా, నాన్న, తమ్ముడు — అందరినీ చూచి సంబర పడుతున్న కూతురికి తెలియదు అగ్నిపర్వతం పేలబోతున్నదని.

బ్రేక్‌ఫాస్ట్ అయింది. మామూలుగానే టోస్ట్, బటర్, చీజ్, జామ్— ఎవరికి కావలసింది వాళ్ళు తీసుకున్నారు. బ్లాక్ కాఫీ, పాలు, పళ్ళు కూడా ఉన్నాయి. అమెరికా నుంచి వచ్చిన అమ్మాయి మరీ నాజూకు. తినటం అయిందనిపించి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళారు.

పీటర్ టేబుల్ టెన్నిస్ బంతిని గోడకు కొట్టి ఆడుకొంటున్నాడు. ఇంట్లో ఉండే పాత ఫెమినా మాగజైన్లు దిమ్మ మీద కూర్చొని తిరగేస్తోంది మిరియం. కూతురి డ్రెస్‌లో బటన్స్, హుక్స్ లేని చోట కుడుతోంది సిల్వియా. రాబర్ట్ మేకుల డబ్బా తీసుకున్నాడు. గట్టిగా ఉండేట్టు వూడిపోయిన మేకులు బిగగొట్టి, తీగలు బిగించాడు. రేపు తాను విడిపోతే ఏం చేస్తుంది సిల్వియా పాపం ఒంటరిగా అనుకున్నాడు.

ఒక కొయ్య మేకు దింపి వదులుగా ఉన్న గేటును సరి చేశాడు. మసి పట్టిన గుంజను తీసివేసి పందిరికి మంచి గుంజ పాతాడు. ఆ పూటంతా తోట పనితో సరిపోయింది.

పగలు గడిచింది. రాత్రి భోజనాలప్పుడు పిల్లలకు చెప్పమంది సిల్వియా. 'అమ్మా —నేనూ విడిపోతున్నాము' అని ఒక్కసారిగా చెప్పలేక పోతున్నాడు రాబర్ట్. రాత్రి భోజనాల దగ్గర నలుగురూ కూర్చున్నారు.

"ఏంటి మమ్మీ! కూర ఇంత కారం?" అంటూ అందులోని బంగాళాదుంప ముక్కలను నలుపుతోంది మిరియం.

"కారం లేని వేపుడు వేసుకో" అని వడ్డిస్తోంది సిల్వియా.

"చూడమ్మా మిరియం" డాడీ తనను ఇలా పిలవటం కొత్తనిపించింది కూతురికి. కూర కారమన్నందుకు కోపం రాలేదు గదా. డాడీకి అయినా తానేమంత తప్పు చేసింది. తండ్రిని చూసింది ప్రశ్నార్థకంగా.

"మిరియం!"

"యెస్ డాడీ!"

"అమెరికాలో మమ్మీ, డాడీలు పోట్లాడుకుంటారా?"

"మై గాడ్! అదా డాడీ? చిన్న చిన్న మాట పట్టింపులతో విడిపోతారు కూడా. ఇక్కడ ఇండియాలో లాగ కాదు."

"అలా విడిపోవడం మంచిదేనా?"

"నిజంగా మమ్మీ, డాడీ! అది మంచిది. మాట పట్టింపులతో ఎలా కలిసి ఉండటం?"

"అయితే వినండి. మీ మమ్మీకి ఏదో మాట పట్టింపు వచ్చింది. మేము విడిపోతున్నాం."

"నో.నో. మీ గురించి కాదు నేను చెప్పింది. మీరు కలిసే ఉండాలి."

"కాదమ్మా నీకు తెలియదు. విడిపోవాలని ఎప్పుడో అనుకున్నాం—నీ కోసమే ఎదురు చూశాం."

"అవునా మమ్మీ! అబద్ధం కదూ? డాడీ పెద్ద జోక్ చేస్తున్నాడు కదూ?"

"యెస్ డార్లింగ్" అని మాత్రం అనగలిగింది సిల్వియా. అక్కడ నుండి లేచి వరండాలోకి వెళ్ళింది.

అంతవరకు ఇవన్నీ వింటున్న పీటర్ ఏమీ మాట్లాడలేదు. కస్టర్డ్ కప్ అందుకోబోయి గ్లాసులో నీళ్ళు ఒలకబోశాడు. కస్టర్డ్‌లో ఉంచిన స్పూను కింద పడేశాడు. చేత్తోనే తినబోతూ నోటికి పులుముకున్నాడు. వేళ్ళంతా కస్టర్డ్ అయింది.

"పీటర్! డోన్ట్ బి సిల్లీ" అంటూ పెద్దరికాన్ని కనబరిచింది మిరియం. తమ్ముని చేతిలోంచి కప్ తీసి బల్లమీద పెట్టింది.

"రామూ! ఇవన్నీ తీసెయ్" అంటూ తమ్ముణ్ణి వాష్ బేసిన్ దగ్గరకు తీసుకెళ్ళి చేతులు, ముఖం కడిగింది. పీటర్‌ను గదిలోకి తీసుకెళ్ళింది.

ఎలాగో సముదాయించుకొంటుంది. ఇప్పటికీ గండం గడిచినట్టే. మరి రేపటి మాటేమిటి? అనుకున్నాడు నిస్సహాయంగా రాబర్ట్.

మర్నాటి ఉదయం పిల్లలంతా పిక్‌నిక్ నుంచి తిరిగి వస్తున్నారు. బడి దగ్గరకు తాను వెళ్ళకపోయినా జాన్ వచ్చేస్తాడు. ఇక ఎంతో కాలం పిల్లల దగ్గర తాను ఉండబోననుకుని ఉదయాన జాన్‌ను తీసుకు వద్దామని బయలు దేరాడు.

"డాడీ! నేను వస్తా" అని మిరియం కూడా కారెక్కింది. గేటుదాకా వచ్చిన టామీ చెట్టుకింద నిలబడి పోయింది.

"మమ్మీ ఎలా ఉంటుంది డాడీ, నీవు లేకుండా?"

"మీరంతా ఉంటారుగా!"

"అది మీ నిశ్చయమే అనుకోండి. మాకు మాత్రం మీరిద్దరూ కావాలి. నిన్న పీటర్‌ను చూశారుగా!" ఇలా అయిదు నిమిషాలన్నా మాట్లాడుకోలేదు. స్కూల్ దగ్గరకు వచ్చేశారు.

దూరంనుండే కారును గుర్తుపట్టిన జాన్ పరుగు పరుగున వచ్చాడు. అక్క దగ్గర అంత చనువు లేకపోయినా ఇద్దరూ కలిసి చాలాకాలమయింది.

"మిరియం! ఎప్పుడొచ్చావు? నాకేం తెచ్చావు?" అని చేతులు పట్టుకుని ఉయ్యాల ఊగుతున్నాడు.

"జాన్! ఎలా ఉంది మీ పిక్నిక్?"

"బ్రహ్మాండంగా ఉంది. మేము చేపలు పట్టాం. సీతాకోక చిలుకలను పట్టాం. ఆ తోపులో పెద్ద పెద్ద చెట్లున్నాయి. కోతులు కొమ్మలకు తోకలు చుట్టుకుని వేలాడుతున్నాయి. పిక్నిక్ చాలా సరదాగా గడిచింది" అని గబగబా చెప్పుకుపోతున్న జాన్ ఎదుటి వాళ్ళు వింటున్నారో లేదో కూడా గమనించలేదు.

ఇల్లు చేరుకున్నారు. వేసిన జోళ్ళతోనే ఇంట్లోకి చొరబడిన జాన్ అమ్మ ఒడిలో వాలిపోయాడు. తాను ఏమేం చూశాడో, ఏమేం చేశాడో ఏకరువు పెట్టే జాన్‌కు తల్లి కంట్లో లీలగా మెదిలిన నీటిచుక్క కనబడలేదు.

స్నానాలయ్యాయి. ఒక్కొక్కరే తయారయి హాల్లోకి చేరుకుంటున్నారు. సిల్వియా సోఫామీద కూర్చుంది. ఎదురుగానే రాబర్ట్స్ కూచున్నాడు. జాన్ నాన్నకు దగ్గర్లోనే టామీని ఆట పట్టిస్తున్నాడు. సంగతి చెప్పనున్నట్లు రాబర్ట్స్ వైపు చూసింది సిల్వియా.

"జాన్—మాట" అన్నాడు. ఒడిలోకి తీసుకుని నిమురుతూ మెల్లగా చెప్పాడు. "చూడు జాన్! అమ్మా, నేను విడిపోతున్నాము."

"అంటే ఏంటి డాడీ?"

"అంటే మమ్మీ, డాడీ ఈ ఇంట్లో కలిసి ఉండరు."

"మేము?"

"మీరంతా మమ్మీతో ఉంటారు."

"మరి డాడీ?"

"డాడీ వేరేచోట ఉంటాడు."

"ఎందుకు డాడీ? ఎందుకు మమ్మీ?" అంటూ ఇద్దరి మధ్య పరుగులు తీశాడు జాన్.

ఎందుకు? అసలు ఎందుకు? ఏమని చెప్పాలి ఈ పిల్లలకు? పిల్లల మాట ఆలోచించాలి కదా.

ఎందుకు అనే మూడక్షరాల మంత్రం పనిచేసింది. జాన్‌ను ముద్దాడి సోఫాలో సిల్వియా పక్కన కూర్చున్నాడు రాబర్ట్స్. ఒక చేత్తో అమ్మచేతిని, ఒకచేత్తో నాన్న చేతిని పట్టుకుని రెండు చేతులూ కలిపాడు జాన్.

ఇద్దరి కళ్ళు కలిశాయి.

అవును, తనకోసమే రాబర్ట్స్ అన్ని పనులు చేస్తున్నాడు.

"డాడీ చెప్పింది సరికాదు. అందరమూ కలిసే ఉంటాం" అని గొణిగింది సిల్వియా.

తథాస్తు అన్నట్టు 'భౌ, భౌ' అంటూ ఒళ్ళు విరుచుకుంది కాళ్ళ దగ్గర టామీ. *


# రూపానికి రూపం-గుణానికి గుణం!

## కొత్త ఫిలిప్స్ వేలియంట్

1 బ్యాండ్ల ట్రాన్సిస్టర్లలో అపూర్వమైనది : టోన్ కూడా అపూర్వం!

అమరిన సౌకర్యాలు

| టోన్ మరియు సౌండ్ కొరకు ఆకర్షణీయమైన కంట్రోల్స్ | బ్యాండ్‌ను సులభంగా మార్చుకునేందుకు కీలక్స్, క్రోమ్ పుష్ బటన్లు | రౌండ్ నాబ్ |
|---|---|---|



బ్యాటరీనుంచి కరెంటుకు మార్చుకొనేందుకు సెట్‌లోపలే తగిన సదుపాయం

ఫిలిప్స్ రూ. 595/-*

* చిల్లరగా అమ్మే గరిష్ఠ వెల, ఎక్సైజ్ డ్యూటీతో సహా. రాష్ట్ర అమ్మకం పన్ను, ఇతర స్థానిక పన్నులు అదనం.

PHILIPS

CASPR-656-153 TL